స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయండి

సీఎంకు హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయడంలేదని, పారిశుధ్య కార్మికులకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు.

కవితతో కేటీఆర్, హరీశ్ ములాఖత్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితతో కేటీఆర్, హరీశ్‌రావు శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ధైర్యం చెప్పారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉన్నదని, త్వరలోనే బెయిల్ లభిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం సుప్రీంకోర్టులో వేయనున్న బెయిల్ పిటీషన్‌పై ఢిల్లీలో న్యాయ నిపుణుల బృందంతో కేటీఆర్, హరీష్‌రావు చర్చించారు.

కేకే రాజీనామా ఆమోదం

రాజ్యసభ సెక్రటేరియట్ బులెటిన్ విడుదల

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : రాజ్యసభ సభ్యత్వానికి కే కేశవరావు చేసిన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదించారు. రాజీనామాను ఆమోదించినట్టుగా రాజ్యసభ సెక్రటేరియట్ శుక్రవారం బులెటిన్ విడుదల చేసింది.

మల్లన్న హుండీకి 3.98 కోట్ల ఆదాయం

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : శ్రీశైల మల్లన్న దేవస్థానానికి రూ.3,98,34,583 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. గత నెల 6వ తేదీ నుంచి ఈ నెల 3 వరకు హుండీలకు వచ్చిన కానుకలను లెక్కించగా, 148 గ్రాముల బంగారం, 6.260 కిలోల వెండితోపాటు 835 యూఎస్ డాలర్లు, 30 యూరోలు, 2 ఒమన్ రియాల్స్, 2 ఖతార్ రియాల్స్, 105 కెనడా డాలర్లు, రెండు సింగపూర్ డాలర్లు, 35 ఆస్ట్రేలియా డాలర్లు, 55 యూఏఈ దిర్హామ్స్, 20 సౌదీ అరేబియా రియాల్స్, 106 మలేషియా రింగిట్స్, 80 థాయిలాండ్ బాట్స్ వచ్చినట్టు వివరించారు.

జపాన్‌లో రైలు పట్టాల నిర్వహణకు రోబో

టోక్యో: జపాన్‌లో రైలు పట్టాల నిర్వహణకు ఓ భారీ హ్యూమనాయిడ్ రోబో రంగంలోకి దిగింది. 12 మీటర్ల ఎత్తయిన ఈ రోబోను వెస్ట్ జపాన్ రైల్వే ప్రవేశపెట్టింది. రైలు పట్టాల నిర్వహణ, చెట్ల కొమ్మల నరికివేత, పెయింటింగ్ వంటివాటి కోసం దీనిని ఉపయోగిస్తారు. కోక్ బాటిల్ వంటి కళ్లు, పొడవైన చేతులతో ఇది అందరినీ ఆకట్టుకుంటున్నది. దీని ఆపరేటర్ ట్రక్ కాక్‌పిట్‌లో కూర్చుని, దీని కళ్లలో నుంచి కెమెరాల ద్వారా పరిశీలించి, రిమోట్ ద్వారా పని చేయిస్తారు. ఇది 40 కేజీల బరువును ఎత్తగలదు. అదేవిధంగా బ్రష్ పట్టుకుని పెయింట్ వేయగలదు.

వాతావరణ మార్పులతో 4% నవజాత శిశువుల మృతి

న్యూఢిల్లీ, జూలై 5: నవజాత శిశువుల మరణాలకు వాతావరణంలో సంభవించే మార్పులకు సంబంధం ఉందా? అంటే ఉందనే అంటున్నది జర్మనీకి చెందిన పరిశోధక బృందం. పాట్స్‌డామ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ ఇంపాక్ట్ రిసెర్చ్, జర్మనీ సహా పలువురు అంతర్జాతీయ పరిశోధకుల బృందం సుమారు 20 ఏండ్లకు పైగా జరిపిన పరిశోధన వివరాలను జర్నల్ నేచర్ కమ్యూనికేషన్ వెల్లడించింది. 29 తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో, ముఖ్యంగా ఉప-సహారా ఆఫ్రికా, ఆసియాలలో జరిపిన పరిశోధనల అనంతరం అధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలతో పాటు వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల కారణంగా నాలుగు శాతానికి పైగా నవజాత శిశువుల మరణాలు సంభవిస్తున్నాయని ఈ పరిశోధన తెలిపింది.

శాసనమండలి రద్దయ్యే ప్రమాదం

- ఎమ్మెల్యేల్లో మూడోవంతు మండలిలో ఉండాలి
- మండలి సభ్యుల సంఖ్య కనిష్ఠంగా 40కి తగ్గొద్దు
- 119కి 39 మంది మాత్రమే ఉండే అవకాశం
- అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుని రద్దుతో సమస్య
- విభజన చట్టం అమలుతోనే సమస్యకు పరిష్కారం
- మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ వెల్లడి

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో రమావత్‌నాయక్, లీగల్ సెల్ సభ్యుడు కల్యాణ్, నాయకులు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనమండలి రద్దయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీలోని ఎమ్మెల్యేల సంఖ్యలో మూడోవంతు సభ్యులు శాసనమండలిలో ఉండాలని తెలిపారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 ప్రకారం శాసనమండలిలో కనీసం సీట్లు 40 ఉండాలని చెప్పారు. తెలంగాణ శాసనసభలో ఇంతకుముందు నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేలను కలుపుకొని మొత్తం 120 మంది ఉండేవారు. వీరిలో మూడోవంతు 40 మందితో శాసనమండలిని కొనసాగిస్తున్నారు. కాగా కేంద్రం ప్రభుత్వం గత లోక్‌సభ సమయంలో రాజ్యాంగ సవరణ చేసి అసెంబ్లీలో ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను నామినెట్ చేసే విధానాన్ని తొలగించిందని తెలిపారు. దీంతో దీనితో తెలంగాణ అసెంబ్లీలో శాసనసభ్యుల సంఖ్య 119కి తగ్గిందన్నారు. ఎమ్మెల్యేల్లో మూడో వంతు మాత్రమే కౌన్సిల్ సభ్యులు ఉండాలన్న నిబంధనల ప్రకారం మండలిలో సభ్యుల సంఖ్య 39కి పడిపోతుందని వివరించారు. మండలిలో కనీసం 40 మంది సభ్యులు ఉండాలనే నిబంధనను ఉల్లఘించినట్టు అవుతుందని అన్నారు. దీనిపై ఎవరైనా కోర్టు వెళితే వెంటనే మండలి రద్దు అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలి

తెలంగాణ శాసనమండలి కొనసాగాలంటే అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలని వినోద్‌కుమార్ సూచించారు. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం తెలంగాణలో 153కు, ఏపీలో 225కు అసెంబ్లీ సీట్లను పెంచాల్సి ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు భేటీ అవుతున్న నేపథ్యంలో ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్రంలో చంద్రబాబు కీలకంగా ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెంపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. అసెంబ్లీ సీట్లను పునర్వ్యవస్థీకరించాలని గతంలో కేంద్రాన్ని కోరినా స్పందించలేదని, కుంటిసాకులు చెప్పిందని గుర్తుచేశారు. కానీ జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ సీట్లను పెంచుకున్నారని, కేంద్రానికి ఇష్టం ఉంటే సీట్లను పెంచుకుంటున్నారని తెలిపారు. విభజన చట్టాన్ని అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబుతో మాట్లాడాలని, తద్వారా తెలంగాణ మండలిని కొనసాగించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇరువురు రాష్ట్రాల సీఎంల సమావేశంలో తెలంగాణ ప్రయోజనాల లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడొద్దని సూచించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన విషయంలో గత చరిత్రను పరిశీలించాలని సూచించారు.

మేం బీఆర్ఎస్‌లోనే ఉంటాం

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అంతర్గత ఒప్పందం

- కేసీఆర్‌ను దెబ్బ తీయడమే రెండు పార్టీల లక్ష్యం
- బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అంతర్గత ఒప్పందంతో పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. ఈ రెండు పార్టీల లక్ష్యం కేసీఆర్‌ను దెబ్బతియడమేనని స్పష్టంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో చాలా విచిత్రాలు జరుగుతాయన్నాని, బీజేపీ, కాంగ్రెస్ అక్రమ పొత్తు కొనసాగుతున్నదని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి తెలంగాణ సంపదను అమ్మేస్తున్నాయని, సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తున్నాయని, ఈ వేలానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా వెళ్లారని చెప్పారు. కాంగ్రెస్ వేసిన విద్యుత్తు కమిషన్‌కు బీజేపీ మద్దతు పలుకుతూ కేసీఆర్‌ను టార్గెట్ చేశాయని తెలిపారు. కాంగ్రెస్ బీ ఫామ్‌పై గెలిచిన తుమ్మల నాగేశ్వర్‌రావు ఖమ్మం టీడీపీ ఆఫీస్‌లో గెలుపు సంబురాలు చేసుకున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయనేందుకు ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో అద్భుతంగా మాట్లాడారని టీడీపీ సోషల్ మీడియా స్పందిస్తున్నదని ఆధారాలను చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ కలిసి పనిచేయాలని రాహులు గాంధీ చెప్పినట్టు తెలుస్తున్నదని అనుమానం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణకు కవచం అని, తెలంగాణ ప్రయోజనాల కోసమే పాటుపడుతుందని స్పష్టంచేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ వ్యవరిస్తుంటే కాంగ్రెస్ వత్తాసు పలుకుతున్నదని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానంటున్న రాహుల్ గాంధీకి పదో షెడ్యూల్‌లో ఏముందో తెలియనట్టుందని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టడం ఖాయమని చెప్పారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రధాని ప్రమాణస్వీకారానికి రావాలని ఆహ్వానించినా కేసీఆర్ వెళ్లలేదని గుర్తుచేశారు. తాను, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పార్టీ మారే ప్రసక్తే లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని మరోసారి స్పష్టం చేశారు.

స్పీకర్ సమయమిచ్చి కలువరా?

- నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు
- ఏ హోదా లేకున్న కాంగ్రెస్ నేతలదే పెత్తనం
- ప్రివిలేజ్ మోషన్ నోటీస్ ఇద్దామని వచ్చాం
- రెండు గంటలు వేచిచూసినా స్పీకర్ రాలేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కల్వకుంట్ల సంజయ్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. అధికారిక హోదా లేకున్నా కాంగ్రెస్ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడానికి తాము టైం అడిగితే శుక్రవారం ఉదయం 11 గంటలకు టైం ఇచ్చారని, కానీ ఆయన అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ రెండు గంటలకుపైగా అసెంబ్లీలో స్పీకర్ కోసం వేచిచూసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ప్రివిలేజ్ మోషన్ ఇవ్వటానికి అపాయింట్‌మెంట్ అడిగితే.. స్పీకర్ తమకు టైం ఇచ్చి మరీ అందుబాటులోకి రాలేదని తెలిపారు. స్పీకర్ మళ్లీ ఎప్పుడు టైం ఇస్తే అప్పుడు కలిసి ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని వెల్లడించారు.

చర్యలు తీసుకొనేవరకు ఊరుకోను: కౌశిక్‌రెడ్డి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ స్పీకర్ తమకు ఉదయం 11 గంటలకు టైం ఇచ్చారని, ఒంటి గంట వరకు స్పీకర్ కోసం ఎదురు చూశామని, ఎన్నిసార్లు ఫోన్‌చేసినా అందుబాటులోకి రాలేదని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో అధికారులు యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తాను విద్యాశాఖపై రివ్యూ మీటింగ్ పెడితే తనపై క్రిమినల్ కేసు పెట్టారని తెలిపారు. కరీంనగర్ డీఈవో, జడ్పీ సీఈవోపై ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడానికి స్పీకర్‌ను కలవాలని అనుకున్నామని వెల్లడించారు. డీఈవోను సస్పెండ్ చేయించే వరకు, జడ్పీసీఈవోపై చర్యలు తీసుకునే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, చట్టం ముందు అందరూ సమానమేనని, కోర్టు మొట్టికాయలు వేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిరావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు వల్ల కల్యాణ లక్ష్మి చెక్కులు బౌన్స్ అవుతున్నాయని తెలిపారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కేసులు పెడితే భయపడేవాడిని కాదని, జైలుకు పోవడానికీ సిద్ధమేనని తేల్చిచెప్పారు. సీఎం కాన్వాయ్‌కు కూడా అడ్డం పడతానని, కచ్చితంగా ప్రివిలేజ్ మోషన్ ప్రవేశ పెడతానని వెల్లడించారు.

అధికారం ఉందని విర్రవీగొద్దు: కల్వకుంట్ల సంజయ్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కేసీఆర్‌ను తిడితే గొప్ప నాయకుడు కాలేవనే విషయాన్ని ఆయన తెలుసుకోవాలని చురక అంటించారు. అధికారం ఉన్నదని విర్ర వీగొద్దని, కేసీఆర్ ఉద్యమం చేసినపుడు ఆది శ్రీనివాస్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిట్టి రేవంత్ మెప్పు పొందలేరని అన్నారు. వరద కాలువ సమస్యలు ఉన్నాయని, వాటి గురించి ముందు పట్టించుకోవాలని సూచించారు.

అర్ధరాత్రి చీకటి కుట్రలు

మొదటిపేజీ తరువాయి...

చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు. అంతకుముందు.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కే కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన మరుసటి రోజే తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. చట్టాన్ని గౌరవించటం తన అభిమతమని, నైతికంగా ఉండటం ధర్మమని తన రాజీనామా సందర్భంగా కేశవరావు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు లేదా ఎమ్మెల్సీలు నైతిక బాధ్యతగా తమ పదవులకు రాజీనామా చేయకపోవడం గమనార్హం. ఇటీవల జిగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కి సీఎం రేవంత్ రాత్రి పదకొండు తరువాతే కండువా కప్పటం, తాజాగా ఎమ్మెల్సీలు కూడా అర్ధరాత్రి దాటిన తరువాత ఆ పార్టీలో చేరడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చీకటి రాజకీయాలకు తెరతీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వీరికి నైతికత లేదా?

పార్టీ మారినందుకే తాను తన ఎంపీ పదవికి రాజీనామా చేశానని కే కేశవరావు ప్రకటించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి, నైతిక విలువలకు గౌరవాన్ని ఇచ్చి తాను ఎంపీ పదవి నుంచి వైదొలగిన నేపథ్యంలో పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఇది వర్తించదా? అన్న చర్చ విస్తృతంగా సాగుతున్నది. కేకే రాజీనామా చేసినట్టుగానే పార్టీ మారిన ఎమ్మెల్యేలు కూడా పదవులను వీడి మళ్లీ ఎన్నికల్లో గెలవాల్సి డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది. మరోవైపు త్వరలో మరో ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని, వారిని కూడా రాత్రిపూటే చేర్చుకుంటామని చెప్తున్నారు.

- తండ్రికి గుడి కట్టించిన తనయుడు

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంటలో తండ్రి స్మారకార్థం తనయుడు గుడిని కట్టించాడు. గ్రామానికి చెందిన అంబల్ల లింబాద్రి ఏడాది క్రితం మృతిచెందాడు. ఆయన కుమారుడు శ్రీనివాస్ తండ్రి స్మారకార్థం గ్రామ శివారులో రూ.3 లక్షలతో గుడిని నిర్మించి, విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. శుక్రవారం గ్రామస్థుల సమక్షంలో ఈ గుడిని శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించాడు. తండ్రికి గుడి కట్టించిన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు. – కథలాపూర్

పారదర్శకతకు 'ట్రిబ్' పాతర

- ఇతర బోర్డులకు భిన్నంగా నియామక ప్రక్రియ
- అనుమానాలకు ఆజ్యం.. అభ్యర్థుల్లో ఆందోళన
- జీఆర్ఎల్ నుంచి అన్ని అంశాల్లోనూ గందరగోళం
- నాలుగు నెలలుగా ట్రిబ్ కన్వీనర్ పోస్టే ఖాళీ
- అయినా కొనసాగుతున్న నియామక ప్రక్రియ

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) పారదర్శకతకు పాతరేసింది. అసమగ్ర నియామక ప్రక్రియతో అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. మిగతా బోర్డులకు భిన్నంగా ఈసారి పోస్టుల భర్తీ ప్రక్రియను నిర్వహిస్తున్నదని అభ్యర్థులు నిప్పులు చెరుగుతున్నారు. తమ గోడును పట్టించుకోకుండా పోస్టుల భర్తీ చేపడుతుందని వారంతా గగ్గోలు పెడుతన్నారు. ప్రస్తుతం చేపట్టిన 9,210 పోస్టుల భర్తీలో ఏ మాత్రం ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర బోర్డులు నిర్ణీత గడువును ఇచ్చి పోస్టులను భర్తీ చేస్తుండగా, అందుకు విరుద్ధంగా ట్రిబ్ గోపత్యను పాటిస్తూ, రాత్రికి రాత్రే ఫలితాలను వెల్లడించింది. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన తొలుత 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. ఇతర రిక్రూట్‌మెంట్ బోర్డులు రోజుకు 100 మంది చొప్పున మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించగా, ట్రిబ్ మాత్రం అందుకు భిన్నంగా సబ్జెక్టుల వారీగా 1:2 జాబితాలో ఉన్న అభ్యర్థులందరికీ ఒక్క రోజులోనే, అదీ అర్ధరాత్రి దాటేవరకూ సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగించింది. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే తుది జాబితాను ప్రకటించింది. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థి హాల్‌టికెట్ నంబర్, రాతపరీక్షలో సాధించిన జనరల్ ర్యాంకు, అభ్యర్థి సాధించిన మార్కులను ప్రకటించాల్సి ఉన్నది. జీఆర్ఎల్ జాబితాను బోర్డు సైట్‌లో పొందుపరచాల్సి ఉన్నది. 2018, 2019లో ట్రిబ్ సైతం ఈ విధానాన్ని పాటించింది. కానీ ఇప్పుడు మాత్రం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జీఆర్ఎల్‌ను ప్రకటించనేలేదు.

దాటవేత ధోరణి

అభ్యర్థులు తమ మార్కులు, ఇతర వివరాల కోసం ఆర్టీఐ కింద సమాచారాన్ని కోరినా ట్రిబ్ మాత్రం దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నది. 'నియామక ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతున్నది. మీరు అడిగిన సమాచారం ఇవ్వడం ఈ పరిస్థితుల్లో సాధ్యం కాదు. రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ మొత్తం పూర్తయ్యాక మీరు కోరిన సమాచారాన్ని బోర్డు సైట్‌లోనే పెడతాం. అక్కడి నుంచి మీరు తీసుకోవచ్చు' అంటూ ట్రిబ్ పేర్కొనడం గమనార్హం. దీంతోనే అభ్యర్థుల్లో మరిన్ని అనుమానాలకు ఆజ్యం పోస్తున్నది. జీఆర్ఎల్‌ను ప్రకటించకపోయినా కనీసం వ్యక్తిగత ఐడీలోనూ వివిధ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల మార్కులనూ వెల్లడించకపోవడం గమనార్హం. ట్రిబ్ ఎందుకు ఇంతలా గోప్యత పాటిస్తున్నదని అభ్యర్థులు నిలదీస్తున్నారు. దీంతోనే రిక్రూట్‌మెంట్ తీరుపై అభ్యర్థులు మండిపడుతున్నారు.

ట్రిబ్ కన్వీనర్ ఎవరు?

గురుకుల సొసైటీల పోస్టులను ట్రిబ్ ఆధ్వర్యంలోనే భర్తీ చేస్తున్నారు. ఆ సొసైటీల సెక్రటరీల్లో ఎవరు సీనియర్ అధికారిగా ఉంటారో వారు చైర్మన్‌గా, తదుపరి సీనియర్ అధికారి కన్వీనర్‌గా కొనసాగుతారు. మిగతా సొసైటీల సెక్రటరీలు సభ్యులుగా ఉంటారు. అయితే ప్రస్తుతం ఒకవైపు గురుకుల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నా ఇప్పటికీ కన్వీనర్‌గా ఎవరినీ నియమించకపోవడం, బాధ్యతలు అప్పగించకపోవడం గమనార్హం. గతంలో ట్రిబ్ కన్వీనర్‌గా వ్యవహరించిన మల్లయ్య భట్టును నియామక ప్రక్రియ మధ్యలో మార్చి నెలలోనే ప్రభుత్వం బదిలీ చేసింది. నాటి నుంచి కన్వీనర్‌గా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. సొసైటీల్లో ప్రస్తుతం సీనియర్ సెక్రటరీగా ఆయేషా మస్రత్ ఖానం ట్రిబ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆ తర్వాత సీనియర్‌గా మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు ఉన్నారు. ఆయనకు సైతం ప్రభుత్వం కన్వీనర్‌గా బాధ్యతలను అప్పగించలేదు. కన్వీనర్ లేకుండా సొసైటీ పోస్టుల నియామక ప్రక్రియను కొనసాగిస్తుండటం కొసమెరుపు.

ఖమ్మం గుమ్మానికి కేసీఆర్ జలతోరణం

- సమైక్య పాలనలో ఎటు చూసినా ఎండమావులే
- తలాపునే గోదావరి ఉన్నా తప్పని సాగునీళ్ల గోస
- ప్రాజెక్టులు ప్రతిపాదించినా పనులు ఎక్కడివక్కడే
- కేసీఆర్ చేసిన రీఇంజినీరింగ్‌తో జిల్లాకు జలసిరి
- సమీకృత సీతారామ ప్రాజెక్టుతో సస్యశ్యామలం

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తలాపున గోదావరి పారుతున్నా.. ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించడంలో ఉమ్మడి రాష్ట్రంలోని పాలకులు నిర్లక్ష్యం వహించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఖమ్మం జిల్లాలో పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ప్రాజెక్టును నిర్మించి ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 70 వేల ఎకరాలకు సాగునీటిని అందించారు. అనంతరం ఖమ్మం జిల్లాలో ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఖమ్మం జిల్లాను దాటుకుంటూ వందల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుండడంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం అది ఆచరణలోకి వచ్చి ఖమ్మం జిల్లా వాసుల చిరకాల కల సాకారమైంది.

సమైక్య పాలనలో నీటి కుట్రలు

ఉమ్మడి పాలకుల నీటి కుట్రలకు మరోనిదర్శనం.. జలయజ్ఞంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిపాదించిన రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరా సాగర్ ప్రాజెక్టులే. 2005లో ఈ రెండు ప్రాజెక్టులను ప్రతిపాదించినా తెలంగాణ ఏర్పడే వరకూ పనులు పూర్తి చేయలేదు. ఏపీ పునర్విభజన అనంతరం ఈ రెండు ప్రాజెక్టులకు కొత్త సమస్యలు తలెత్తాయి. రాష్ట్ర విభజనలో ఖమ్మం జిల్లాకు చెందిన 7 మండలాలు ఏపీ రాష్ట్రానికి బదిలీ చేసిన కారణంగా ఇందిరాసాగర్ రుద్రమకోట ప్రాజెక్టు అంతర్రాష్ట్ర ప్రాజెక్టుగా మారిపోయింది. ఏపీ సహకారం లేనిదే ఖమ్మం జిల్లాలోని ప్రతిపాదిత 1,33,000 ఎకరాలకు నీరు అందివ్వని పరిస్థితి నెలకొన్నది. ప్రాజెక్టు హెడ్ వర్క్స్ ఏపీలో ఉన్నందున భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు నిర్వహణలో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజీవ్ దుమ్ముగూడెం ప్రాజెక్టు పైప్‌లైన్ మార్గం కిన్నెరసాని వన్యప్రాణి అటవీ ప్రాంతం నుంచి వెళ్లేవిధంగా డిజైన్ చేయడంతో అనుమతులు రావడం అనుమానంగా మారిపోయింది. వెరసి ఈ రెండు ప్రాజెక్టులు నిరర్థకంగానే మిగిలిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

కేసీఆర్ దూరదృష్టి

స్వరాష్ట్రం ఏర్పాటు వెంటనే తొలి ముఖ్యమంత్రిగా సాగునీటి ప్రాజెక్టులపై జిల్లాల వారీగా కేసీఆర్ సమీక్షించారు. రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ఎత్తిపోతల పథకాల్లోని లోపాలు, సాంకేతిక సమస్యలను గ్రహించి ఆ రెండు ప్రాజెక్